క్లుప్తంగా

కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి: ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు అమలుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక, కొత్తపేట, వెంకట్రావుపల్లిలో బుధవారం సుతారి సంఘం సమావేశాల్లో పాల్గొన్నారు. ఫిబ్రవరి 21న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం రాములు మాట్లాడుతూ రేషన కార్డునే ఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించాలని, వివాహాలకు, డెలివరీలకు సాయం పెంచాలని కోరారు. కార్మికులు పని చేసే చోట మరణిస్తే ప్రమాదబీమా ఇవ్వాలని, 55 ఏళ్లు దాటిన కార్మికులకు రూ. 5 వేల ఫించన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజయ్య, రాములు, వెంకటేశం తదితర కార్మికులు ఉన్నారు.

ఘనంగా దుబ్బ రాజన్న జాతర


ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లిలోని శ్రీ దుబ్బరాజరాజేశ్వర స్వామి ఆలయంలో మాఘ అమావాస్య సందర్భంగా శివకల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేములవాడ మండలంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. వేములవాడ రాజన్న ఆలయంలో కోడెమొక్కు చెల్లించే విధంగా ఈ ఆలయంలో కూడా భక్తులు కోడెమొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు.

మానేర్ కెనాల్‌కు గండి



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో మానేరు కెనాల్‌కు గండి కొట్టారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేసినట్లు పోతుగల్ రైతులు తెలిపారు. మానేరు ప్రాజెక్టు డీ–18 నుంచి పోతుగల్‌లోని శ్రీరామాలయం వరకు ఉన్న ఉపకాలువను ధ్వంసం చేసి కొందరు అక్రమంగా నీటిని తరలిస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేసి గండి కొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకుని, గండిని పూడ్చివేయాలని రైతులు కోరారు.

నియామకం



ఎల్లారెడ్డిపేట: మండల జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా పందిర్ల శ్రీనివాస్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ సమక్షంలో మండలంలోని అన్ని గ్రామాలకు అధ్యక్షులను నియమించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా పాత్తూరి శివ, మండల ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, మండల సహాయ కార్యదర్శిగా బాల్‌రాజ్ రమేశ్‌ను నియమించారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి అమరగొండ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి రథోత్సవం


రథాన్ని లాగుతున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో బుధవారం రాములోరి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం రాములబండపై జాతర జరుగుతుందని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తజనం పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు. రథోత్సవంలో మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు పాల్గొన్నారు.

'గోరుముద్ద' ప్రారంభం

బోయినపల్లి: విలాసాగర్ హైస్కూల్‌లో గోరుముద్ద కార్యక్రమాన్ని ఎంఈవో శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపా రు. హెడ్‌మాస్టర్ బొలగం శ్రీనివాస్, బోయినపల్లి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ భూమయ్య తదితరులు ఉన్నారు.


ముస్తాబాద్ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కోనరావుపేట: మామిడిపల్లిలో భక్తుల పూజలు


గంభీరావుపేట: భీముని మల్లారెడ్డిపేట వీరాంజనేయస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

వైభవంగా మాఘ అమావాస్య జాతర

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి, నాగారం, మల్కపేట, ధర్మారం గ్రామాల్లో మాఘ అమావాస్య జాతర ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. భక్తులు పుణ్యస్నానాలు చేసి ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. మామిడిపల్లి, నాగారంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేములవాడ ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లు చేయించారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ, బీజేవైఎం అధ్యక్షులు మిర్యాల్‌కార్ బాలాజీ, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవోలు గుట్ట శ్రావణ్, బ్రాహ్మణ గారి శ్రీనివాస్, డీఈ మహిపాల్ రెడ్డి, ఏఈ రామకృష్ణారావు, ఆలయ పర్యవేక్షకులు వెంకటప్రసాద్, ఇన్‌స్పెక్టర్ నూగూరి నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మల్కపేట, ధర్మారం, నాగారం, మామిడిపల్లిలో జరిగిన జాతర ఉత్సవాల్లో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని కొడుముంజ రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. స్వామివారిని మండలనాయకులు దర్శించుకున్నారు

గంభీరావుపేట: గంభీరావుపేట, భీమునిమల్లారెడ్డిపేటలో మాఘ అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. భీమునిమల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మాఘ అమావాస్య వేడుకలు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆలయాల్లో పూజలు చేశారు.


కోనరావుపేట: మామిడిపల్లిలో జాతరకు తరలివచ్చిన భక్తులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కొండపై భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. 2వేల మందికి అన్నప్రసాదం అందించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రైతులు గిరిప్రదర్శన చేశారు. చీకోడులో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం, జాతర నిర్వహించారు. పోతుగల్ శ్రీ రామాలయంలో, రామలక్ష్మణపల్లె శ్రీరామాలయం మానేరు నదిలో ఉత్సవాలు నిర్వహించారు. మొర్రాయిపల్లె, కొండాపూర్‌లో పెరుమాండ్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి బుగ్గరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తుల సౌకర్యార్థం సిరిసిల్ల ఆర్టీసీ డిపో అధికారులు ఒక్క రోజు ప్రత్యేక బస్సులు నడిపించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ కేశవ పెరుమాండ్ల ఆంజనేయస్వామి, గాలం గుట్ట ఆంజనేయస్వామి, నారాయణపూర్ మానేరు వాగులోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య దంపతులు, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మాజీ సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ప్రముఖ వైద్యులు సత్యనారాయణస్వామి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్, నర్సింగాపూర్ సరిహద్దు అటవీప్రాంతంలోని లొంక వీర హనుమాన్ ఆలయంలో మాఘ అమావాస్య జాతర జరిగింది. నర్సింగాపూర్, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె, రామన్నపేట, మూడపల్లి, గోస్కుల పల్లె, నర్సింగపూర్, వేములవాడ రూరల్ మండలంలోని బాల్‌రాజుపల్లె, నూకలమర్రి గ్రామాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. జోగాపూర్ శివారులోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నాగంకుమార్ స్వామి మొక్కులు చెల్లించుకున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జాతర నిర్వహించారు. సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. మండలంతోపాటు తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.


ఎల్లారెడ్డిపేట ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న నాయకులు


ముస్తాబాద్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన


చందుర్తి: నర్సింగాపూర్ అటవీ ప్రాంతంలోని లొంక వీర హనుమాన్ జాతరలో భక్తులు


ఇల్లంతకుంట : పెద్దలింగాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయం చుట్టూ వాహనాల ప్రదర్శన

నిధుల మంజూరుపై హర్షం


సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలోని చంద్రగిరి – తెట్టకుంట రోడ్డునిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో రూ. కోటి 20 లక్షలు నిధులు మంజూరుకావడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తెలిపారు. నాయకులు ఎర్రం రాజు, శ్రీనివాసరావు, ఎర్రం అగయ్య, కత్తి కనుకయ్య, విద్యాసాగర్, సతీశ్, తదితరులు ఉన్నారు.

అయ్యోరుపల్లిలో..

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు అయ్యోరుపల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి లక్ష్మీపురం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నిధుల మంజూరుకు కృషిచేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు అయ్యోరుపల్లి వాసులు క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచులు వడిజె మల్లయ్య, అంజయ్య, నాయకులు మల్లయ్య, రఘుపతి, నవీన్, హనుమయ్య, రాజు, అంజయ్య, శంకరయ్య, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, సీతక్క, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మర్తనపేట నుంచి పల్లిమక్త గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్‌రెడ్డి, భూషణం, నాయకులు భాస్కర్‌రావు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు 20 రకాల వైద్య పరీక్షలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారిణి సారియా అంజుమ్ బుధవారం తెలిపారు. మలేరియా, టైఫాయిడ్, టీబీ, తెమడ, రక్తమూత్ర, షుగర్ తదితర 20 పరీక్షల శాంపిళ్లు తీసి గంట వ్యవధిలో రిపోర్టులు అందిస్తామన్నారు. అలాగే రిపోర్టులను రోగుల రిజిష్టర్ మొబైల్‌కు టెస్టు రిపోర్టు ఎస్‌ఎంఎస్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ పరీక్షలు ప్రతిరోజు చేస్తామని మండల ప్రజలు ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

బోయినపల్లి: ఆరు గ్యారంటీలు, గ్రామసభల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ అన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 26న రాత్రి రైతుభరోసా డబ్బులు రైతుల అకౌంట్లలో పడతాయని సీఎం చెబితే రైతులు ఆశగా ఎదురుచూశారని, ఇప్పటివరకు డబ్బులు పడలేదన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నర్సింహాచారి, మెరుపుల గంగాధర్, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌చారి, సుంకపాక ప్రభు, అమిరిశెట్టి గంగయ్య, అనీల్, శరత్, సాయికుమార్, బ్రహ్మ ప్రసాద్, తిరుపతి, వెంకటేశ్,స్వామి, ధర్మేంద్ర,మధు తదితరులు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు


బోయినపల్లి: నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బోయినపల్లిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించిన యువజన కాంగ్రెస్ మండల నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురాం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లెలో బుధవారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు మిరాల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. గ్రామానికి చెందిన రొడ్డ దేవవ్వకు రూ. 47500, ములిగె దేవయ్యకు రూ.14500 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఇక్కడ నాయకులు తదితరులున్నారు.

ముస్తాబాద్: గూడెం, పోతుగల్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మాజీ వైస్‌ఎంపీపీ ఎల్లాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్, సింగారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, దేవారెడ్డి, తదితరులున్నారు.

రుద్రంగి: మండలంలోని దెగావత్ తండాలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ. 94 వేల విలువైన చెక్కులను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి


నోటీసులు ఇస్తున్న అధికారులు

రుద్రంగి: వ్యాపార, వాణిజ్య సముదాయాల పెండింగ్ (ట్రేడింగ్) లైసెన్సులను వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని ఎంపీవో సధాకర్, కార్యదర్శి రాందాస్ సూచించారు. బుధవారం వారు జీపీ సిబ్బందితో కలిసి వ్యాపార సముదాయాల వారికి పెండింగ్ ట్రేడింగ్ నోటీసులను అందజేశారు. సిబ్బంది రాజేశం, రాణవేణి బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లిలో ఎస్సీసంఘం వద్ద, శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో మంజూరైన బోరు మోటార్లను గ్రామశాఖ అధ్యక్షుడు జోగినిపల్లి మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ రాజు నాయక్,(బోరెవెల్స్) ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు భూక్యా ప్రకాశ్‌నాయక్ నూనె నర్సారెడ్డి, ఉప్పు నోటి కిషన్,తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బీభత్సం



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో టిప్పర్ డ్రైవర్ మద్యంమత్తులో బీభత్సం సృష్టించాడు. వేములవాడ మహాలక్ష్మి ఆలయం వద్ద టిప్పర్‌తో విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టాడు. అక్కడి నుంచి బ్రిడ్జి వద్ద బారికేడ్లను, బ్రిడ్జిని, హరిత హోటల్ వద్ద ఉన్న కదిరె రాజమల్లయ్య ఇంటి ఎదుట రేకుల షెడ్డును ఢీకొట్టడంతో లారీ ఆగిపోయింది. మద్యం మత్తులో డ్రైవర్ దాదాపు రెండు కిలోమీటర్లు బీభత్సం సృష్టించగా.. స్పృహ కోల్పోవడంతో స్థానికులు వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఎల్‌వోసీ మంజూరు

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన బండి బాలకృష్ణ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా వైద్య ఖర్చుల కోసం రూ.లక్షా 50 వేల విలువైన ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి బుధవారం మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, కేకేకు అలాగే మంజూరుకు సహకరించిన మండల అధ్యక్షుడు టోని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంకు బాలకృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు గద్దర్ జయంతి



సిరిసిల్లటౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు తెలిపారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక రుచి హోటల్‌లో రాజకీయ పార్టీలకతీతంగా నిర్వహించే కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

ముస్తాబాద్: మానేరు ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీందిస్తామని ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజినీర్ అమరేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరు ప్రాజెక్టు కుడి కెనాల్ ద్వారా 7వేల ఎకరాలకు సాగునీరందించేందుకు తైబందీ తీర్మానం చేసినట్లు తెలిపారు. రైతుల నిర్ణయం మేరకు వరినాట్ల అనంతరం నాలుగు రోజుల వ్యవధి అనంతరమే నీటిని విడుదల చేయాలని నిర్ణయించారన్నారు. యాసంగిలో వరి పంట పూర్తిగా సాగయ్యే వరకు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.ఇప్పటికే మల్లన్నసాగర్ ద్వారా ముస్తాబాద్, ఎగువ మానేరుకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. దుబ్బాక మండలం రాజక్కపేట ఊర చెరువులోకి మల్లన్నసాగర్ నీరు వస్తోందని, అక్కడి నుంచి ముస్తాబాద్ పెద్ద చెరువుకు నీరు త్వరలోనే వస్తుందన్నారు. ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది వరకు మానేరు కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని రైతులు సహకరించాలని కోరారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



కోనరావుపేట: మండలంలోని ధర్మారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఇటీవల మందకృష్ణకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



వీర్నపల్లి: మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండాకు చెందిన భూక్యా సక్కుబాయి 7వ తెలంగాణ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. జిల్లా తరఫున పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంది. 27, 28న జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి రెండు విభాగాల్లో (డిస్కస్ త్రో, షాట్‌పుట్) రెండో స్థానంలో నిలిచింది.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో ఎగువ మానేరు కాలువలోకి మూడు రోజులుగా నీరు రావడం లేదు. డిస్ట్రిబ్యూటర్–18 వరకు నీరు అందకపోవడంతో వరి పంటలకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. మానేరు నీరే ఆధారంగా తాము పంటలు సాగు చేస్తున్నామని పోతుగల్ రైతులు వాపోతున్నారు. తైబందీ మేరకైనా నీరు విడుదల చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రవికుమార్
డీఈఈ,సెల్‌నెంబర్ 99635 55560

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రెయిలింగ్ ఏర్పాటు


మర్రిగడ్డ శివారులో వ్యవసాయ బావి వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేయిస్తున్న సిబ్బంది

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ శివారు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఉన్న వ్యవసాయ బావి వద్ద అధికారులు బుధవారం రెయిలింగ్ ఏర్పాటు చేయించారు. ఈనెల 19న సాక్షిలో ప్రచురితమైన ప్రమాదాలపై పట్టింపేది? అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

గిద్ద చెరువు వద్దకు వారసంత..

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంతను స్థానిక గిద్ద చెరువు వద్దకు మార్చేందుకు అధికారులు నిర్ణయించారు. రోడ్డుపై నిర్వహిస్తున్న వారసంతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు బుధవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో గిద్ద చెరువు సమీపంలో వారసంతను కొనసాగించాలని గ్రామ పంచాయతీ సభల్లో పలుసార్లు తీర్మానించారు. అయితే ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న సంతను గిద్ద చెరువు వద్దకు మార్చుతామని ఎంపీడీవో సత్తయ్య తెలిపారు.

సాక్షి స్పందన